సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 16 । నవంబర్ । 2024



ఘనంగా కార్తీక పౌర్ణమి
జిల్లావ్యాప్తంగా కార్తీక పౌర్ణమిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రం మత్స్యగుండం మత్స్యలింగేశ్వరుని ఆలయంలో సహస్ర దీపార్చన నిర్వహించారు.
– సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

ఎస్టీ సాధికారత అవగాహన వర్క్‌షాపు నేడు
జి.మాడుగుల: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో ఈ నెల 16న శనివారం గిరిజన సాధికారత అవగాహన వర్క్‌షాపును నిర్వహిస్తున్న సీబీడీ అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సాధికారతపై అవగాహన కల్పించడమే సదస్సు ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 13 దరఖాస్తులు

ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్

సాక్షి,పాడేరు: కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్,జేసీ అభిషేక్‌గౌడ్ నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో 13 దరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు తమ సమస్యలను వారికి విన్నవించుకున్నారు. సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

పోరాట యోధుడు బిర్సా ముండా
- కలెక్టర్ దినేష్‌కుమార్


ఐటీడీఏ వద్ద బిర్సా ముండా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ అధికారులు

సాక్షి,పాడేరు: బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ పోరాడిన యోధుడు భగవాన్ బిర్సా ముండ చరిత్రలో నిలిచారని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆయన 150వ జయంతిని ఐటీడీఏ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో అటవీ ప్రాంతాల్లో జరిగిన మిలినేరియన్ ఉద్యమానికి బిర్సా ముండా నాయకత్వం వహించారని, 22ఏళ్ల వయసులోనే బ్రిటిషర్లపై యుద్ధం ప్రకటించిన ధీరుడన్నారు. హక్కులు, చట్టాలపై గిరిజనులను చైతన్య పరిచారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, ఏవో హేమలత, గిరిజన సంక్షేమశాఖ అరకు ఈఈ వేణుగోపాల్,ఇన్‌చార్జి డీడీ రజనీ పాల్గొన్నారు.

ఘనంగా జ్వాలాతోరణం

పాడేరు, అరకులోయలో జ్వాలా తోరణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి,పాడేరు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని భక్తులంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రాత్రి పల్లకిలో ఊరేగించిన అనంతరం జ్వాలాతోరణాన్ని ఆలయ ప్రాంగణంలో వెలిగించారు. అరకులోయలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలోను జ్వాలా తోరణాన్ని ఘనంగా నిర్వహించారు.

గిరి రైతుల నుంచి నేరుగా కాఫీ కొనుగోళ్లు
చింతపల్లి: గిరి రైతుల నుంచి నేరుగా కాఫీ పండ్ల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని మాతోట స్వచ్ఛంద సంస్థ సీఈవో సీఈవో వనపల చెన్నారావు తెలిపారు. శుక్రవారం మాతోట కార్యాలయంలో బోర్డు డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కాఫీ పండ్లను కిలో రూ.45కు కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. దూర ప్రాంత రైతులు నేరుగా రైతు ఉత్పత్తిదారుల కేంద్రానికి తీసుకు వచ్చినట్లయితే కిలోకు రూ.50 ధర చెల్లిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌పీవో చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జీసీసీ కొనుగోలు చేయాలి

కాఫీ గింజల మాదిరిగానే మిరియంను జీసీసీ కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి.ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించడం వల్ల నష్టపోతున్నాం. జాతీయ మార్కెట్‌లో కిలో రూ. వెయ్యి ధర ఉండగా స్థానిక వ్యాపారులు రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారు. కలెక్టర్ చొరవతీసుకుని మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.
– పాలికి లక్కు, కాఫీ రైతుల సంఘం ప్రతినిధి, గుర్రగరువు, పాడేరు మండలం

ఏటా మోసపోతున్నాం

దళారులకు విక్రయించడం వల్ల ఏటా మోసపోతూనే ఉన్నాం. గిట్టుబాటు ధర చెల్లించడం లేదు. కొనుగోలు చేసేటప్పుడు తూకంలోనూ మోసం చేస్తున్నారు. మార్కెటింగ్ కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలోకి రావడం లేదు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా మిరియం మార్కెటింగ్‌కు దూరంగా ఉంటున్నాయి.
– దిప్పల కొండబాబు, మిరియం రైతు, మోదాపల్లి, పాడేరు మండలం

రైతు కష్టం దళారుల భోజ్యం

మన్యంలో మిరియం రైతుల కష్టం దళారుల పరమవుతోంది. జాతీయ మార్కెట్లో ధరకు.. స్థానికంగా వారు చెల్లించే ధరకు సగం మేర తేడా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కిలోకు సుమారు రూ.500 మేర వ్యత్యాసం ఉన్నందున భారీగా ఆదాయం కోల్పోతున్నారు.



ఏటా వ్యాపారుల దోపిడీకి గురవుతున్న మిరియం రైతు

- మార్కెటింగ్ లేక భారీగా నష్టం
- ప్రైవేట్ వ్యాపారులే ఆధారం
- జాతీయ మార్కెట్‌లో కిలో రూ.వెయ్యి
- స్థానికంగా రూ.500 మాత్రమే చెల్లింపు
- సగానికి సగం దోపిడీ
- గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్న అధికార యంత్రాంగం
- పంట సేకరణకు సిద్ధమవుతున్న గిరి రైతులు

సాక్షి, పాడేరు: జాతీయస్థాయి మార్కెట్లో మన్యం మిరియాలకు మంచి డిమాండ్ ఉన్నా గిరి రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లభించడం లేదు. మార్కెటింగ్‌పై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోవడం వల్ల దళారులపై ఆధారపడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

➠ పాడేరు డివిజన్‌లో 1.10 లక్షల ఎకరాల కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియంను సాగు చేస్తున్నారు. గతేడాది 80 వేల ఎకరాల్లో ఎకరాకు వంద కిలోల ఎండు మిరియం దిగుబడి వచ్చింది. సుమారు 8వేల టన్నుల మేర మార్కెటింగ్ జరిగినట్టు పాడేరు ఐటీడీఏ కాఫీ బోర్డు అధికారవర్గాలు తెలిపాయి.


కాఫీ తోటల్లో అంతరపంటగా మిరియం పాదులు

ఆశాజనకంగా దిగుబడి

➠ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఏజెన్సీ అంతటా మిరియం పాదులు విరగ్గాశాయి. దిగుబడి ఆశాజనకంగా ఉన్నందున మద్దతుధర లభిస్తే ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని గిరి రైతులు ఆశిస్తున్నారు. ఏటా కాఫీ మార్కెటింగ్ పైనే జీసీసీ, ఐటీడీఏ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దృష్టిపెడుతున్నాయి. కాఫీ పంటకు అనుబంధమైన మిరియం మార్కెటింగ్‌ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

➠ దేశంలో కేరళ, కర్నాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో మిరియంను సాగు చేస్తున్నప్పటికీ జిల్లాలో సాగు చేస్తున్న మిరియానికి మంచి డిమాండ్ ఉంది. సేంద్రియ విధానంలో పండించడం వల్ల జాతీయస్థాయి మార్కెట్‌లో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల లాభాలు వారికి మాత్రమే దక్కుతున్నాయి.

➠ గిరి రైతులకు కిలోకు రూ.500కు మించి ధర రావడం లేదు. గతేడాది కిలో రూ.550కు కొనుగోలు చేసిన వ్యాపారులు సీజన్ చివరలో రూ.500కు తగ్గించేశారు. దీంతో వంద కిలోలకు రూ.5వేల వరకు ఆదాయం కోల్పోయారు. వ్యాపారులు జాతీయస్థాయి మార్కెట్లో కిలో రూ.వెయ్యి చొప్పున విక్రయించారు.

➠ నాణ్యమైనవిగా మన్యం మిరియాలకు గుర్తింపు ఉన్నప్పటికీ మార్కెటింగ్ కల్పించడంలో జీసీసీ, పాడేరు ఐటీడీఏ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్ మిరియం రైతులు నష్టపోతున్న వైనంపై స్పందించారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇంతలో ఆయన బదిలీపై వెళ్లిపోయారు.

మార్కెటింగ్‌కు చర్యలు

మిరియం రైతులకు మార్కెటింగ్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జాతీయస్థాయిలో మిరియం వ్యాపారులతో జనవరిలో పాడేరులో సమావేశం నిర్వహించే ఆలోచనలో ఉన్నాం. నాణ్యమైన మిరియం ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగానే గిరి రైతులకు మిరియా సేకరణకు నిచ్చెనలు, గింజలు వలిచేందుకు, ఎండబెట్టిన తరువాత శుభ్రం చేసే యంత్రాలను 75శాతం రాయితీపై పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.
– కల్యాణి,
విస్తరణ అధికారి,
కేంద్ర ప్రభుత్వ స్పైసెస్ బోర్డు, పాడేరు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత
- ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి


మొండికోటలో అడవి తల్లికి హారతి ఇస్తున్న కొండవీటి జ్యోతిర్మయి

జి.మాడుగుల:ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి తెలిపారు. మండలంలో సింగర్బ పంచాయతీ మొండికోటలో చిద్గాగనంద స్వామీజీ ఆశ్రమంలో శుక్రవారం అడవి తల్లికి హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గిరిజన దంపతులు సాగేని చినబాబు ఆచారి, కిముడు పొట్టాచారి, సాగేని కొండాచారి, పాంగి రమణమూర్తి, పాంగి చిట్టిబాబు, గండేరి చిన్న కృష్ణ ఆచారి, శివలింగం ఆచారి, కిముడు శ్రీనివాసాచారి, పాంగి రాజాచారిలకు ఆమె పాదసేవ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిపై సమస్త జీవరాసులు ఆధారపడి ఉన్నందున అడవితల్లిని కాపాడుకోవాలని ఆమె కోరారు. మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించాలని ఆమె కోరారు. ప్రతీ ఒక్కరు భక్తిభావం అలవర్చుకోవాలని ఆమె తెలిపారు. అన్నమయ్య కీర్తనలు, ప్రవచనాలు, ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. కార్యక్రమంలో చిద్గాగానందస్వామీజీ ఆశ్రమం సభ్యులు సాగేని రమానందం , చిట్టాచారి, పాంగి సూకరాజు, పి చిట్టాచారి, పాంగి శ్రీహరి, భక్తులు పాల్గొన్నారు.


ఆశ్రమంలో గిరిజన దంపతులకు పాదసేవ చేస్తున్న జ్యోతిర్మయి

కాఫీ రైతులకు శుభవార్త

- మార్కెటింగ్‌కు ముందుకు వచ్చిన టాటా సంస్థ
- అభినందించిన కలెక్టర్ దినేష్‌కుమార్


హాజరైన అధికారులు, టాటా సంస్థ ప్రతినిధులు


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : గిరిజనులు పండించే కాఫీ మార్కెటింగ్ చేసేందుకు ప్రముఖ వాణిజ్య సంస్థ టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీ ముందుకు రావడం హర్షణీయమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో టాటా సంస్థ ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంస్థకు అవసరమైన మేర కాఫీ గింజలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. సంస్థ ఆశించిన స్థాయిలో గ్రేడింగ్ చేయిస్తామన్నారు. ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్ రకాలకు వేరు చేస్తామన్నారు. ప్రస్తుతం సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక గిరిజన రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారన్నారు. నూతన మార్కెటింగ్ కోసం తాము అన్వేషిస్తున్న తరుణంలో టాటా గ్రూప్ ముందుకు రావడం శుభపరిణామమన్నారు. సంస్థ ప్రతినిధులు లోగో గురించి మాట్లాడగా లోగోను రూపొందించి కాఫీ రైట్స్ తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. టాటా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అమిత్ పంత్ మాట్లాడుతూ రెండు రోజులుగా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించామన్నారు.

స్థానికంగా సాగవుతున్న కాఫీ నాణ్యతను పరిశీలించామన్నారు. కాఫీ పంట నాణ్యత బాగుందన్నారు. ఐటీడీఏ, జీసీసీ తరఫున కాఫీ కొనుగోలు, బ్రాండింగ్‌కు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాఫీ పంటకు అదనపు విలువలు జోడించేందుకు అవసరమైన శిక్షణను రైతులకు అందిస్తామన్నారు. ఐటీడీఏ, జీసీసీ, కాఫీ బోర్డు, రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. అరకు కాఫీకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న విషయాన్ని గుర్తించామని చెప్పారు. భీసుపురం, సుంకరమెట్ట కాఫీ తోటలు తమకు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. ఈ సమావేశంలో టాటా మార్కెటింగ్ లీడ్ మేనేజర్ వెంకటేష్‌బాబు, ఐటీడీఏ ఏపీవో(పీవీటీజీ) ఎం. వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు సీనియర్ లైజన్ ఆఫీసర్ రమేష్, కాఫీ ఏడీ అశోక్, జీసీసీ పాడేరు, చింతపల్లి డీఎంలు బుక్కా సింహాచలం, దేవరాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు బీఎస్ నందు, రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

28 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్‌లో ధాన్యం కొనుగోలుకు 28 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహణ కొరకు సాంకేతిక, ప్రాక్టికల్ శిక్షణను శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024–25కు ధాన్యం సాధారణ రకం క్వింటాల్ రూ. 2300 , గ్రేడ్ -ఏ ధాన్యం క్వింటాల్ రూ. 2320గా ప్రభుత్వం ధర నిర్ణయించినట్టు తెలిపారు. ఏజెన్సీలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అడ్డతీగల మండలంలో – 3, దేవీపట్నం మండలంలో -4,గంగవరం మండలంలో -4, మారేడుమిల్లి మండలంలో-1, రాజవొమ్మంగిలో-6, రంపచోడవరంలో -6 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.శిక్షణ కార్యక్రమంలో డివిజనల్ పౌర సరఫరాలశాఖ అధికారి విజయభాస్కర్, ఏవోలు, వీపీఏలు, డీఈవోలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చట్టిలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జంక్షన్‌లో దుకాణాల వద్ద చెత్తను పారిశుధ్య, వివిధ శాఖల సిబ్బందితో కలసి ఆయన శుభ్రం చేశారు. దుకాణాల ఎదుట చెత్త లేకుండా చూడాలని, పరిశుభ్రత పాటిస్తే రోగాలు కూడా రాకుండా వుంటాయని ఆయన వ్యాపారులకు సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ఓ హోటల్‌లో ఆయన స్వయంగా టీ కాచి సిబ్బందికి అందించారు.

పాఠశాలల్లో మొక్కల పెంపకం

పర్యావరణ పరిరక్షణకు డివిజన్లోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక కేజీబీవీలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. వారినుంచి ఆసక్తి గల రంగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు ఆయన సివిక్స్ పాఠాలు బోధించారు.


చట్టిలో రోడ్డును శుభ్రం చేస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

సుందరీకణకు చర్యలు

చింతూరు మండలాన్ని సుందరీకరణ చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో చింతూరుకు చెందిన వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుందరీకరణ చేపట్టేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీనికి సహకరించాలని వ్యాపారులను ఆయన కోరారు. దుకాణాల ఎదుట పరిశభ్రత పాటించాలని, మొక్కలు పెంచాలని పీవో సూచించారు.

చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌తో మెరుగైన వైద్యం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

హుకుంపేట: పాఠశాలల్లో చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని డీఎంహెచ్‌వో జమల్‌బాషా పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్యాధికారులు, విద్య, గిరిజన సంక్షేమశాఖ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి ఎత్తు, బరువు తెలుసుకుంటారన్నారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వైద్యం అందించేందుకు సమీప ఆస్పత్రులకు తరలిస్తామన్నారు. ఆరోగ్య పరీక్షలను ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ కిషోర్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రద పాల్గొన్నారు.


పాడేరు డిగ్రీ కళాశాలకు బి డబల్ ప్లస్ గ్రేడ్

నాక్ బృందం ప్రకటన

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బి డబల్ ప్లస్ గ్రేడ్‌ను నాక్ బృందం ప్రకటించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7,8 తేదీల్లో కళాశాలను రెండు రోజులు సందర్శించిన నాక్ చైర్మన్ రమేష్‌శర్మ, కోఆర్డినేటర్ సభ్యులు కులభూషణ్ చందేల్,సుస్మగోస్లే అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించారని తెలిపారు. నాలుగు వేల మార్కులకు గాను తమ కళాశాల 2893 మార్కులతో బి డబల్ ప్లస్ గ్రేడ్ సాధించినట్టు చెప్పారు. 2019లో నాక్ బృందం సి గ్రేడ్ ప్రకటించిందని, ప్రస్తుతం బి డబల్ ప్లస్‌కు పెరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత రెండేళ్ల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పన, ఉన్నత విద్యాభివృద్ధి లక్ష్యంగా తామంతా పనిచేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతమైన పాడేరు ప్రభుత్వ కళాశాలకు బి డబల్ ప్లస్ గ్రేడ్ రావడం పెద్ద విజయమన్నారు. బి ప్లస్ గ్రేడ్‌కు ఐదేళ్ల కాల పరిమితిని నాక్ ప్రకటించిందన్నారు. ఈ విజయంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు ,అధ్యాపకులు, అధ్యాపకేతరులు, క్రేటిరియా ఇన్‌చార్జిలు, టెక్నికల్ సిబ్బంది ముఖ్య పాత్ర పోషించారని, వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు.



హిమ సొగసు
మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు కమ్ముకుంటున్నాయి. ఈ అందాలను పర్యాటకులు ఎంతగానో ఆస్వాదిస్తున్నారు.
– ముంచంగిపుట్టు



పాల సముద్రం
వంజంగి హిల్స్‌లో ఆహ్లాదకర వాతావరణంలో శుక్రవారం సూర్యోదయం అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. మేఘాలు నేలజారాయా అన్నట్టుగా కొండల మధ్య పాలసముద్రాన్ని తలపించాయి. మంచు తెరల్లో ఉదయ భానుడి అందాలు ఆకట్టుకున్నాయి.
– సాక్షి, పాడేరు



ముత్యాల గూడు
ముంచంగిపుట్టులో మంచు బిందువులతో నిండి ఉన్న ఓ సాలెగూడు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంది. వలను తలపించేలా ఉన్న ఈ అందాన్ని ఆసక్తిగా తిలకించారు.
– ముంచంగిపుట్టు

క్లుప్తంగా

రహదారి నిర్మాణానికి కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగుడ, కడరేవు గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులతో పాటు, ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు డోలీ మోతలు తప్పడం లేదని, రహదారి నిర్మించాలని కోరుతూ కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్‌కు జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, గ్రామస్తులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. . అటవీ శాఖ అనుమతులు ఇచ్చి రోడ్డు ప్రారంభించి, గిరిజనుల ప్రాణాలు కాపాడాలని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుమ్మ పంచాయితీ మారుమూల గ్రామాలు కరిగోడ, కడరేవే, కొట్టింగ్‌గుడ, గొప్పలపాలెం, మర్రిబంద గ్రామాలకు రోడ్డు నిర్మాణం కోసం రూ.7.5 కోట్లతో నిరించే రోడ్డు ప్రజలకు అందుబాటులో రావాలని కోరారు. సర్పంచ్, వార్డు మెంబర్లు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

200 కిలోల గంజాయి స్వాధీనం : ఒకరి అరెస్టు



జి.మాడుగులలో గంజాయి నిందితుడితో ఎస్‌ఐ షణ్ముఖరావు, పోలీసులు

జి.మాడుగుల: నుర్మతి జంక్షన్ వద్ద పోలీస్‌లు వాహన తనిఖీ చేస్తుండగా జీపులో మైదాన ప్రాంతాలకు రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షణ్ముఖరావు శుక్రవారం విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.నుర్మతి జంక్షన్ రోడ్డులో పోలీస్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా పెదబయలు మండల గ్రామాల వైపు నుంచి జీపు వాహనం వస్తుండగా నిలిపి తనిఖీ చేయగా అందులో 200కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులకు గాను ముగ్గురు పరారైనట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు గంజాయితో పట్టుబడిన పెదబయలు మండలం సుజరి గ్రామానికి చెందిన గేవాల తిరుపతిని అరెస్టు చేసినట్టు చెప్పారు. గంజాయిని, జీపును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు.

శివారు గ్రామాలకు రహదారులు



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

- రూ.2వేల కోట్లకు ప్రతిపాదనలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని రహదారి సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు రూ.2వేల కోట్లు కేటాయించాలని, ప్రభుత్వాన్ని అడుగుతున్నామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఏ గ్రామాల్లో నిర్మించాల్సిన రహదారుల వివరాలను కోరారు. పీఎం జన్‌మన్ కింద మంజూరైన 185 పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలన్నారు.ఎంపీడీవోలు గ్రామసభలు నిర్వహించి గ్రామతీర్మాణాలు తీసుకోవాలన్నారు.ఐటీడీఏ పీవోలంతా ఇంజనీరింగ్ పనులను సమీక్షించాలని, ఇంజనీరింగ్ అధికారుల ప్రతి 15రోజులకు పనుల పురోగతిపై ఫోటోలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశానికి వర్చువల్‌లో ఐటీడీఏ పీవోలు సింహాచలం, అపూర్వభరత్‌లు హాజరుకాగా, అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించాలి

ప్రమాదాల నివారణ లక్ష్యంగా పాడేరులోని రోడ్డు పక్కన అక్రమణ దుకాణాలన్నింటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశంలో రహదారి భద్రతపై పలు శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.ఈనెల పాడేరులో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న దుకాణాలను తొలగించేందుకు ఈనెల 16వతేది శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.ఉదయాన్నే మైకుల ద్వారా ప్రచారం చేయాలని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ,రెవెన్యూ అధికారులంతా రహదారి మార్జిన్లు గుర్తించి, అక్రమిత స్థలాల దుకాణాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సాయంత్రంలోగా వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేని పక్షంలో అధికారులు వాటిని తొలగించాలని ఆదేశించారు. అరకు రోడ్డులో దుకాణాల తొలగింపు సోమవారం డ్రైవ్ నిర్వహించాలని, సంతలకు కేటాయించిన స్థలాల్లోనే సంతలు జరగాలన్నారు.పర్యాటకులకు ప్రత్యేక భద్రత కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని,ట్రాపిక్ నిభందనలను అమలుజేయాలని,నిర్లక్ష్యం వహిస్తే జరిమానాలు విధించాలని ఆదేశించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తే చర్యలు– జిల్లా ఎస్పీ

బహిరంగ ప్రదేశాలు,ఖాళీ స్థలాల్లో మత్తు పదార్థాలు స్వీకరించడం,మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశించారు.జూనియర్ కళాశాల,ఆర్టీసీ కాంప్లెక్స్‌రోడ్డు,ఇతర ఖాళీ ప్రదేశాలలో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు,ఈసమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌భాషా,ఎంవీఐలు వాసు,రాజేష్‌కుమార్,ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి,ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు,డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు,జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వామిత్రలు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామసభల్లో అభివృద్ధికి ప్రణాళికలు



సమావేశానికి హాజరైన గిరిజనులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రత్యేక గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కిండంగిలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ముందుగా బిర్సా ముండా చిత్రపటం వద్ద కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలవ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక గ్రామసభలతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన వనరులను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సభల ద్వారా గిరిజనులకు అటవీ హక్కులు, పీసా చట్టం తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తామన్నారు. 2005కు ముందు నుంచి గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు అటవీ హక్కు చట్టం కింద హక్కులు కలిప్తిస్తామన్నారు.యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం గిరిజనులతో స్వచ్ఛత, డ్రగ్స్ ఫ్రీ ఇండియాపై కలెక్టర్ పతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డీపీవో లవరాజు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్,పిరమాల్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పండ్ల వ్యాపారి ఆత్మహత్య

పెందుర్తి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక భర్త కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంటలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలివీ.. వేపగుంట రామాలయం వద్ద నివాసం ఉంటున్న పలుకూరి నాగరాజు, విజయలక్ష్మి(37) దంపతులు స్థానికంగా పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం విజయలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లిన నాగరాజు భార్య మరణాన్ని జీర్ణించుకోలేక పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు విజయలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన నాగరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఏరోస్పేస్ శిక్షణకు 50 మంది ఎంపిక



ఏరోస్పేస్ ఇండస్ట్రీయల్ శిక్షణకు ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పెందుర్తి: ఏరోస్పేస్ ఇండస్ట్రీయల్ శిక్షణ తరగతులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఏరోస్పేస్ విభాగంలో 6 నెలల శిక్షణ తరగతులకు గానూ రాత పరీక్షలు నిర్వహించా రు. విశాఖపట్నం, పెందుర్తి, శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 100 విద్యార్థులు పాల్గొనగా వీరిలో విశాఖపట్నం కళాశాల నుంచి 30 మంది, పెందుర్తి కళాశాల నుంచి 15 మంది, శ్రీకాకుళం నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. వీరికి అచ్యుతాపురంలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ కేంద్రంలో శిక్షణ ఇస్తారని సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి రామకృష్ణ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ యు.జయలక్ష్మి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ బిజినెస్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు డ్రోన్ టెక్నాలజీ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. పదో తరగతి ఆపై అర్హత కలిగిన 18–45 వయస్సు కలిగినవారు ఈ కోర్సులో చేరవచ్చని చెప్పారు. మూడు నెలల పాటు డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, అసెంబ్లింగ్ టెక్నీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. 30 సీట్లు మాత్రమే ఉన్నా యని అర్హులైన వారు నేరుగా కాలేజీలోని కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు 7287069457 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్నవారికి టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. వీరి ఉపాధి అవకాశాలకు సహకారం అందిస్తామని ఆయన చెప్పారు.

ప్రశాంతంగా బీఎడ్ పరీక్షలు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎడ్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. వర్సిటీ ఐఏఎస్‌ఈ విభాగంలోని పరీక్ష కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజకుమారి శుక్రవారం పర్యవేక్షించారు. బీఎడ్ సెకెండ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించామన్నారు.

సికింద్రాబాద్–లక్నో స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం: ఇటీవల ప్రకటించిన సికింద్రాబాద్–లక్నో–సికింద్రాబాద్(07084/07083) స్పెషల్ ట్రిప్‌ను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 22న సికింద్రాబాద్–లక్నో(07084) స్పెషల్, ఈ నెల 25న లక్నో–సికింద్రాబాద్ (07083) స్పెషల్‌ను రద్దు చేశారు.

అదనపు పీసీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్ నర్సరీ సందర్శన



సోషల్ ఫారెస్టును పరిశీలిస్తున్న రాహుల్ పాండే

నర్సీపట్నం: నర్సీపట్నం డిపోలో ఉన్న సోషల్ ఫారెస్ట్ నర్సరీని అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ రాహుల్ పాండే శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్క జాతుల గురించి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సోషల్ ఫారెస్ట్ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట విశాఖ కన్జర్వేటర్ మహమ్మద్ దివాన్ మైదీన్, డీఎఫ్‌వో శామ్యూల్, రేంజ్ ఆఫీసర్లు లక్ష్మీనర్సు, సుబ్బారావు, ఫారెస్టర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి



వరాహ పుష్కరిణికి నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు



శేషతల్పంపై వెంకన్న ఉత్సమూర్తులు

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సింహాచలం దేవస్థానంలో పుణ్యనదీ హారతి (గంగా హారతి) కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు పుష్కరిణి గట్టుపై దీపారాధన చేశారు. కోలాటం, నృత్యాలు, సంకీర్తనలతో స్వామిని కొలిచారు. తొలుత శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వెంకన్న ఉత్సవమూర్తులను సాయంత్రం 4.30 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ వేదికపై ఉత్సవమూర్తులను శేషతల్పంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ద్వయ హారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతి స్వామికి సమర్పించారు. తర్వాత ఎనిమిది మంది అర్చకులు పుష్కరిణికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఎనిమిది వేదికలపై నిలబడి వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతులిచ్చారు. విశేషంగా తరలివచ్చిన భక్తులు ఈ కార్యక్రమాలను తిలకించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, చిన్నా తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

పీహెచ్‌సీల అభివృద్ధే ప్రధాన ధ్యేయం

ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధుల బృందం వెల్లడి



ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది



రికార్డులను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

డుంబ్రిగుడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల న్యూఢిల్లీ సెంట్రల్ కమిటీ (ఎన్‌క్యూఏఎస్) బృందం ప్రతినిధులు డాక్టర్ రాజేష్‌కన్నా, డాక్టర్ సుశీల దత్తాత్రాయ్ కవాడీ అన్నారు. శుక్రవారం వారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన వారికి స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో విభిన్నంగా స్వాగతం లభించింది. గిరిజన సంప్రదాయ గిడుగులతో అలంకరించి, విల్లంబులు చేతికి అందించి గిరి మహిళల థింసా నృత్యాలతో వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు ఆరోగ్య కేంద్రం పరిసరాలను క్షణంగా పరిశీలించారు. వార్డులు, పడకలు పరిశుభ్రంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మందుల గది, ఆస్పత్రి నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ తనిఖీ కార్యక్రమంలో వారు అందించే నివేదిక ఆధారంగా పీహెచ్‌సీ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని వైద్యాధికారి రాంబాబు తెలిపారు. ఆస్పత్రి స్థాయి 30 పడకలకు పెంచాలని, ఎక్స్‌రే, ప్రసూతి సేవలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరినట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ, కిల్లోగుడ వైద్యాధికారులు అంభికరమణి, నజీబ్, కుమార్‌రత్న ఎంపీఈహెచ్‌వో శౌరీ, ఎంపీహెచ్‌వో పద్మ, దీన, హెల్త్ అసిస్టెంట్లు శెట్టి.స్వామి, రవింద్ర, సంజీవ్, ప్రభాకర్, లవరాజు, మిల్టాన్, సిబ్బంది జగదీష్, అనిల్ పాల్గొన్నారు.

మీకోసంలో 87 వినతుల స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 84 వినతులు స్వీకరించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్‌గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు సంబంధించి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు జిల్లా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు.

- జి.మాడుగుల మండలం గాడుతూరు పంచాయతీ పచ్చనపల్లికి చెందిన అరకు దానియేలు పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరారు.
- సుమారు 65 మంది భూ పట్టాలకు సంబంధించి వెబ్‌లాండ్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాలని కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లి గ్రామస్తులు కోరారు.
- ముంచంగిపుట్టు మండలం కర్రిముఖిపుట్టు పంచాయతీ రాకాసిరాయి గ్రామానికి కిల్లో రాములమ్మ తమ గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టును తనకు కేటాయించి ఉపాధి కల్పించాలని వినతి పత్రం అందజేసింది.
- కొయ్యూరు మండలం బాలారం పంచాయతీ కొత్తబాలారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు కలేపు సుబ్బారావు ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్‌కుమార్‌రావు, సెరీ కల్చర్ ఏడీ అప్పారావు, రహదారులు, భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డేవిడ్‌రాజు, వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్‌బాషా, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతి



త్రిశూల పర్వతంపై దర్శనమిస్తున్న అఖండ జ్యోతి (ఇన్‌సెట్) త్రిశూల పర్వతంపై జ్యోతిని వెలిగిస్తున్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి వెలసిన త్రిశూల పర్వతంపై శుక్రవారం రాత్రి అఖండ జ్యోతి భక్తులకు దర్శనమిచ్చింది. కార్తీక మాసం పౌర్ణమి రోజున అరుణాచలంలో ఏవిధంగా అయితే అఖండ జ్యోతి దర్శనమిస్తుందో.. అదే విధంగా త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతి దర్శనానికి ఆలయ కమిటీ వారు ఈ ఏడాది నాంది పలికారు. మొదటి సారిగా దర్శనమిస్తున్న అఖండ జ్యోతిని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ముందుగా బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి భక్తులు బయలుదేరి త్రిశూల పర్వతం చేరుకున్నారు. పర్వతంపై అఖండ జ్యోతి వెలిగించే ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కృత్తిక నక్షత్ర హోమం నిర్వహించారు. పూర్ణాహుతి, మహా నైవేద్యం, ధూపసేవ నిర్వహించి, దూదితో ఒత్తు వేసి దానిలో నెయ్యిపోసి ఒత్తిని ఉంచి జ్యోతిని వెలిగించారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం నుంచి త్రిశూల పర్వతంపై వెలిగించిన జ్యోతికి భక్తులు నమస్కరించుకున్నారు. జ్యోతి వెలిగించి త్రిశూల పర్వతంపై పెద్ద ఎత్తున బాణసంచా వెలిగించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ చేశారు.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
కార్యాలయ చిరునామా:- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం.14-1-1/2బి, 2వ అంతస్తు, ... ఎదురుగా, జోనల్ కార్యాలయం, మహారాణిపేట, విశాఖపట్నం-530002.

స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బ్రాంచ్-II చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ ...) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మా రిజిస్టర్డు ఆఫీసును కలిగి, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టర్డై ఉన్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్)లోని రూల్ 3తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ పట్టికలోని వివరాల గల రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.
రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు క్రింది తెలిపిన ఆస్తిని తేది 13-11-2024 న స్వాధీనపర్చుకున్నారు.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం
(1). పిడకల సిరితాత, C/o మహేష్, రాజీవ్‌నగర్, కొత్తవలస గ్రామం మరియు మండలం, విజయనగరం – 535183. (2). చిటిమిరెడ్డి మహేష్, తండ్రి సూర్యనారాయణ, డోర్ నెం. 8-64, రాజీవ్‌నగర్, కొత్తవలస గ్రామం మరియు మండలం, విజయనగరం – 535183. (3). పి.హెచ్. గంగమ్మ, C/o పి.హెచ్. సన్యాసినాయుడు, రాజీవ్‌నగర్, కొత్తవలస గ్రామం మరియు మండలం, విజయనగరం – 535183.	ఋణ ఖాతా నెం. VZMVPTF2304260007, రిఫరెన్స్ క్రింద చెల్లించవలసిన మొత్తం బకాయి రూ. 59,46,387/- (అక్షరాల యాభై తొమ్మిది లక్షల నలభై ఆరు వేల మూడు వందల ఎనభై ఏడు రూపాయలు). డిమాండ్ నోటీసు తేది: 26.08.2024

సబ్బవరం సబ్-రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం: 1792/2023 ప్రకారం చిటిమిరెడ్డి మహేష్ పేరున గల స్థిరాస్తి వివరములు: అనకాపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా మరియు సబ్బవరం సబ్-జిల్లా, గుల్లేపల్లి గ్రామం, ... పంచాయితీ పరిధిలో సర్వే నెంలు.359 మరియు 390 మరియు మొగలిపురం గ్రామం & పంచాయితీలో సర్వే నెం.235 మరియు అనకాపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా మరియు సబ్బవరం సబ్-జిల్లా, మొగలిపురం గ్రామం మరియు పంచాయితీ పరిధిలో సర్వే నెంలు. 235/22, 235/23, 235/25, 235/26, 235/29 మరియు 235/30 లోని ఎల్.పి. నెం.81/2007 తేది 22.12.2007 ద్వారా ఉడా ఆమోదించిన "... రాయల్ ఫేజ్-1" అనే పేరు గల లే-అవుట్ నందు ప్లాట్ నెం.330 లోని 413.44 చ॥గ॥లు లేదా 345.677 చ॥మీ॥ స్థలానికి కొలతలు మరియు హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.331 స్థలం – 61 అ॥ లేదా 18.59 మీ॥, దక్షిణం: ... భూములు – 61 అ॥ లేదా 18.59 మీ॥, పడమర: ... భూములు – 61 అ॥ లేదా 18.59 మీ॥, ఉత్తరం: రోడ్డు – 61 అ॥ లేదా 18.59 మీ॥.

సాధారణ ప్రజానీకమంతటికీ ఈ నోటీసు ద్వారా కూడా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై SFL యొక్క అధీకృత అధికారి చట్టబద్ధ స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీస్ అందిన తదుపరి రుణగ్రహీతలు లేదా ఎవరైనా ఇతరులు SFL యొక్క లిఖితపూర్వక ముందస్తు అనుమతి లేకుండా, ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే ఇతర విధంగానూ బదిలీ చేయరాదు, లావాదేవీ జరపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : విశాఖపట్నం, తేది: 13.11.2024 సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■ విజయవాడ To హైదరాబాద్ హైవేఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4ఎకరములు కలదు. ఐకానిక్ బ్రిడ్జికి 300 మీటర్స్‌లో కోర్ క్యాపిటల్ అమరావతికి 7కి.మీ దగ్గరలో సంప్ర: 93477 56501. [N-1253750]

PLOT FOR SALE
■ 5 లక్షలకే 100 Sq.Yds, గ్రేటర్ విశాఖ GVMC వార్డు పరిధిలో లే అవుట్ ప్లాట్స్ 133, 200 Sq.Yds. కలవు. దగ్గరలో ఇల్లులు, బస్సులు. EMI కలదు. ఫోన్ : 73864 14017, 70936 32399 [V- 823955]
■ 200 Sq.Yds., Plot No. 265, South Facing, 30x60, Ravada Village, Bhogapuram Blue Bay Ventures. Raja Infra Projects. Ph : 93931 21737, 73960 02293 [V- 780442]
■ Spot Registration VMRDA & RERA Approved Plots Sale @ Kothavalasa, Bhogapuram, Atchutapuram with all amenities. Ph : 99492 33989 [V- 7719]
■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్, సంప్ర: 78934 21245 [B-109]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted
■ ప్రముఖ వ్యాపార సంస్థ యందు Managers గా పనిచేయుటకు తగిన అభ్యర్థులు తక్షణమే కావలెను. Retd. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులు, Housewives కు ప్రాధాన్యత ఇవ్వబడును. తగిన అభ్యర్థులకు Salary + Incentive ఇవ్వబడును. ఫోన్ : 94417 90382 [V- 495]
■ ప్రముఖ ఎలక్ట్రానిక్ గూడ్స్ కంపెనీ నందు పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు డీలర్స్ కావలెను. జీతం + కమీషన్ + 5% షేర్ ఇవ్వబడును. వివరాలకై ఫోన్ : 90000 50016 [V-4194]
■ రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ, నెలక్ష రూ॥. ఫ్రెష్/Exp. ఫోన్: 7416396781 [HA- 16464]
■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000627]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030